www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 22 అక్టోబర్ 2025
5
చిత్తూరు



వరసిద్ధుని సేవలో ఢిల్లీ మంత్రి ఆశిష్ సూద్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని మంగళవారం ఢిల్లీ రాష్ట్ర హోం శాఖ, విద్యాశాఖ మంత్రి ఆశిష్ సూద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో

వంతెన... అంతేనా..?

- కుశస్థలి నదిపై నిర్మాణానికి నోచుకోని హైలెవల్ వంతెన
- వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజలు
- కలెక్టర్ వచ్చి పరిశీలించినా కూడా ఏర్పాటు చేయని వంతెన



బురదలో వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి):

కుశస్థలి నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో వర్షాలు వచ్చి నదిలో నీరుపారే సమయంలో కీలపట్టు, ముడిపల్లి, రామాపురం, నెత్తం కండ్రిగ, వీకేఆర్ పురం, తడుకుపేట గ్రామాలకు చెందినవారు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. వర్షాకాలంలో నది ఉప్పొంగితే లోతట్టు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది దీంతో ఈ మార్గాన్ని రెండు వైపులా మూసివేస్తారు. సాహసం చేసి ఆ మార్గంలో నడచి వెళిపోదామని ప్రయత్నించిన వారు కొట్టుకుపోవడం ఆపై వారిని కాపాడటం లాంటి పలు సంఘటనలు ఇదివరకే చోటుచేసుకున్నాయి.

కృష్ణాపురం గేటు ఎత్తడంతో కుశస్థలి నదిలో నీటిమట్టం పెరిగి లోతట్టు వంతెనపై పారింది. ముఖ్యంగా తమిళనాడు వైపుగా వెళ్లే బస్సులకు ఇదే ప్రధాన మార్గం కావడంతో లోతట్టు వంతెనై నీళ్లుపారే సమయాల్లో బస్సు ప్రయాణించే మార్గాన్ని మర్చాల్సివస్తోంది. రెండేళ్ల క్రితం ఇలా పెద్దఎత్తున వంతెనపై రోజుల తరబడి నీరు పారిన సమయంలో లోతట్టు వంతెన కూడా కొట్టుకుపోయింది. దీంతో రోజుల తరబడి ఈ మార్గంలో రాకపోకలు ఆగాయి. అప్పటి మంత్రి ఆర్కేరోజా తాత్కాలిక ప్రాతిపదికన రోడ్డును నిర్మించి భవిష్యత్తులో ఇలాంటి సమస్య రాకూడదని హైలెవల్ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నూతనంగా హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రయత్నాలు చేపట్టారు. దీంతో రోడ్లు భవనాల శాఖకు సంబంధిత ఇంజనీర్లు వంతెన నిర్మించాల్సిన ఎత్తు, వెడల్పు, దూరం వంటివి కొలతలు వేసే సర్వేలు చేసి దానికి సంబంధిత అంచనాలు, అవసరమయ్యే నిధులు అంచనా వేయడం లాంటి ప్రక్రియలు జరిగాయి. 2024 జనవరి 30వ తేదీన ఇంజనీర్ ఇన్‌ఛీఫ్ (ఆర్ అండ్ బి) మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికి రూ.8.14కోట్లు మంజూరు చేసి ఈ టెండర్లు ఆహ్వానించారు. అంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వంతెన నిర్మాణ అంశం మరుగున పడింది.

మళ్లీ అదే పరిస్థితి..

గత ఏడాది నదిలో నీరుపారే సమయంలో లోతట్టు వంతెన కొట్టుకుపోవడంతో స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వంతెన వద్దకు విచ్చేసి పరిశీలించారు. అనంతరం రోడ్లుభవనాల శాఖ అధికారులతో చర్చలు జరిపారు. లోతట్టు వంతెనకు మరమ్మతులు చేపట్టి రోడ్డు నిర్మించడానికి అంచనాలు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నదిలో పేరుకుపోయిన పిచ్చిమొక్కల కారణంగా నదినీరు ముందుకుసాగక రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి వచ్చిందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పిచ్చిమొక్కలు తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. త్వరలో నిధులు కూడా అందిస్తామన్నారు.

అయితే ఇప్పటివరకు ఆ పనులు ఏవీ జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హై లెవెల్ వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని పట్టణ మాసలు కోరుతున్నారు.

వర్షం వస్తే ఈ వంతెనెన పైన ప్రయాణం కష్టమే..

కుశస్థలి నదిలో వర్షపు నీరు వస్తే ఆ వంతెన పై పోవడం, రావడం కష్టమేనని వాహనదారులు చెప్తున్నారు. అంతేకాకుండా వంతెన పక్కన రోడ్డు తెగిపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బంది ఉన్నారని చెప్తున్నారు. ఇలా ప్రతి ఏడాది వర్షం కురిసినప్పుడల్లా ఇలాంటి సమస్య జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని.

తూతూ మంత్రంగా మరమ్మతులు

కుశస్థలి నదిపై ఉన్న తోతట్టు వంతెనపై వర్షపునీరు తరచూ పరుతూ ఉండటంతో రోడ్డు చిద్రమౌతోంది. అయితే ఆ సమయానికి అధికారులు తూతూ మంత్రంగా మట్టివేసి కప్పేసి మమా అనిపించేస్తున్నారు. కానీ మట్టిపోసినా వర్షం పడుతూ ఉండటంతో మట్టిపోసిన ప్రాంతాలు బురదతేలి గుంతలు కావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది.



వంతెన కొట్టుకుపోవడంతో ఇబ్బంది పడుతూ ప్రయాణిస్తున్న ప్రజలు

ఆరు పంచాయతీలలో..

వెలుగులు నింపని దీపావళి

- జోరువానలో యువత శ్రమదానం
- పైపులు ఏర్పాటు చేసుకున్న ప్రజలు
- జీడిరేవుల వంకకు తాత్కాలిక మట్టి రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



యువత శ్రమదానంతో ఏర్పాటు చేసిన పైపులు

ప్రజాశక్తి- సోమల: మండలంలో ఈనెల 18వ తేదీ శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జీడి రేవుల వంకపై ఉన్న తాత్కారిక మట్టి వంతెన కొట్టుకుపోయింది. దీంతో సోమల నుండి నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లి, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, అన్నెమ్మగారిపల్లి పంచాయతీలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పెద్దఉప్పరపల్లి సమీపంలోని గార్గేయ నదిపై 3 తాత్కాలిక మట్టి వంతెనలు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయి. ఈ ప్రాంత ప్రజలు నిత్యావసర సరుకుల కోసం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నంజంపేట, పొదలకుంటపల్లి మార్గమధ్యంలోని దళవాయి చెరువు తూము వద్ద నిర్మించిన తాత్కాలిక మట్టి వంతెన కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

మూడు రోజులు గడుస్తున్న ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదు, కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి వంతెనలు కొట్టుకుపోయిన తరువాత ఏ ఒక్క అధికారి గానీ ప్రజాప్రతినిధులు గానీ సంఘటన స్థలాలను పరిశీలించిన దాఖలాలు లేవు. ప్రజల ఇబ్బందులను గుర్తించి కనీసం వారికి ధైర్యాన్ని చెప్పి వంతెనల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టైనా భరోసా ఇచ్చి రావాల్సిన అధికారులు మిన్నకుండిపోయారు.

జీడి రేవుల వంక సమీపంలోని సరస్వతీపురం గ్రామస్తులు మంగళవారం శ్రమదానంతో జీడి రేవుల వంకపై కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి వంతెన వద్ద ఉన్న పెద్దపెద్ద పైపులను ఒకటిగా అమర్చి వాటిపై ఇసుక మూటలు పేర్చి ఆపై ఎర్రమట్టిని తోలి నడకదారిని సిద్ధం చేశారు.

దీనిపై గ్రామస్తులను వివరణ కోరగా అధికారులు నాయకులు పట్టించుకోకపోవడంతో తామే స్వచ్ఛందంగా శ్రమదానంతో దారి ఏర్పాటు చేసుకున్నామని ఎప్పటికైనా ఈ ప్రాంతంలో శాశ్వత వంతెన నిర్మాణం చేయాల్సిందేనని అప్పటివరకు మాకు ఈ బాధలు తప్పవని అన్నారు. మళ్లీ భారీ వర్షం వచ్చి వంక ఉధృతంగా ప్రవహిస్తే తాము పడిన కష్టం గంగపాలు అవుతుందని అయినా అధికారులను నాయకులను నమ్ముకోక శ్రమదానం చేసి మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నామని దీనివల్ల దాదాపు ఆరు పంచాయతీల వారికి రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందన్న సదుద్దేశంతో తాము వంతెన నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.



జోరువానలో శ్రమిస్తున్న యువత

టీటీడీ ట్రస్ట్‌లకు భారీ విరాళాలు

11 నెలల్లో 918.6 కోట్లు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు వచ్చాయి. 11 నెలల్లో రికార్డు స్థాయిలో రూ.918.6కోట్లు విరాళాలు (2024 నవంబర్ 1 నుంచి -2025 అక్టోబర్ 16వ తేదీ వరకు) దక్కాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీటీడీకి దాతలు క్రమంగా పెరుగుతున్నారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్.నాయుడు బాధ్యతలు చేపట్టాక టీటీడీ ట్రస్ట్‌లకు వెల్లువలా విరాళాలు వస్తున్నాయి. దాతలకు తగిన గౌరవం, సదుపాయాలు కల్పించడంలో ఎక్కడా లోపం తలెత్తకూడదని బీఆర్ నాయుడు అదేశాలు ఇచ్చారు. ట్రస్ట్‌లకు విరాళాలతో పాటు పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివృద్ధికి దాతలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. అత్యధికంగా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.338.8 కోట్ల విరాళం వచ్చింది. ఆఫ్ లైన్ కంటే ఆన్ లైన్ ద్వారానే ఎక్కువ సంఖ్యలో విరాళాలు సమర్పిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా రూ.579.38 కోట్లు, ఆఫ్‌లైన్ ద్వారా రూ.339.20 కోట్ల విరాళాలు అందించారు.

ట్రస్ట్‌ల వారీగా వివరాలు

శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.252.83 కోట్లు, శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ.97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.66.53 కోట్లు, ఎస్వీ గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.56.77 కోట్లు, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు రూ.33.47 కోట్లు, బర్డ్ ట్రస్ట్‌కు రూ.30.02 కోట్లు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.20.46 కోట్లు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.13.87 కోట్లు ఎస్వీబిసీకు రూ.6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ.1.52 కోట్లు.

నిత్య అన్నదాన ట్రస్ట్‌కి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాత మోహన్ కుమార్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం రూ. 1,00,116లను చిత్తూరుకు చెందిన దాత మోహన్ కుమార్, వారి కుటుంబ సభ్యులు మంగళవారం అందించారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్ వాసు టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వర్షంలో తడుస్తూ నిరసన దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీవారి మెట్లు వ్యాపారస్తుల సమస్యల పై గత 427 రోజుల నుంచి నిరసన దీక్ష చేస్తున్నారు. దీపావళి పండుగ రోజున దీపాలు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయ చంద్ర మాట్లాడుతూ ఈ సమస్యను పరిష్కరించాలని టిటిడి ఈవోకు అనేకసార్లు విన్నవించుకున్నా పరిష్కరించకపోవడం చాలా బాధాకరమన్నారు. అన్ని రకాల పండుగలు టెంట్లోనే చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత మూడు రోజుల నుంచి వర్షాలు పడుతున్నప్పటికీ లెక్కచేయకుండా అనారోగ్యాలు గురవుతూ నిరసన దీక్షను చేస్తున్నారని తెలిపారు. పరిపాలన అధికారులు కనీసం మానవతా దృక్పథంతో ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం మానవసేవే మాధవ సేవ అని ప్రచారం చేస్తున్న ఆ పరిపాలన భవనం ముందే 427 రోజుల నుంచి 31 కుటుంబాలు నిరసన దీక్షలో ఉంటే కనీసం పట్టించుకోకపోవడం లేదన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి మెట్లు వ్యాపారస్తుల సంఘం నాయకులు చిరంజీవి పెంచలయ్య, ప్రకాష్, రామ్మూర్తి, గోపి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల రక్షణలో ప్రాణత్యాగం చేసిన

అమరవీరులకు జోహార్లు



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దేశ సరిహద్దుల్లో దేశ ప్రజల ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ పాత్ర ప్రధానమైనదని, దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన వారిని గుర్తుంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తెలిపారు. మంగళవారం పోలీసు గ్రౌండ్‌లో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణ సారిక, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి తుషార్ డూడి, నగర మేయర్ ఆముద, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చూడ చైర్మన్ కటారి హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, దేశ సరిహద్దులు, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ సిబ్బందికి జోహార్లు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అనునిత్యం రక్షణ కల్పిస్తూ ఎటువంటి విపత్తు వచ్చిన ముందుండేది పోలీసు దళాలు సేవలు అసామాన్యం అని వారి త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. జిల్లా ఎస్పీ భద్రతా దళాల గౌరవ వందనం స్వీకరించిన అతిధులు, పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అతిధులచే విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ కుటుంబాల సభ్యులకు ప్రశంసా పత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్సార్ రాజశేఖర్ రాజు, డీఎస్పీలు పాల్గొన్నారు.

శాంతిపురం: మండల పరిధిలోని రాళ్ళబుదుగూరులోని పోలీసు స్టేషన్‌లో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఐ.నరేష్ ఆధ్వర్యంలో పిఎస్‌పి తేజేశ్విని, పోలీస్ సిబ్బంది, గ్రామప్రజలు, విద్యార్థులు అమరవీరుల స్మారక దీపం వెలిగించి ర్యాలీ నిర్వహించారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేశ సేవలో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ స్థానిక రక్షకభటులు నివాళులర్పించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ట్రైనింగ్ ఎస్సై జయశ్రీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎస్సై లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై లతో కలిసి అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కలసి అమరవీరుల ఫోటోలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు



శాంతిపురంలో..



బైరెడ్డిపల్లిలో..

తిరుమలలో ఎడతెరపి లేని వర్షం

- పెరిగిన చలితీవ్రత
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

ప్రజాశక్తి- తిరుమల: నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో తిరుమలలో ఎడతెరపి లేకుండా వర్షం పడుతుంది. మంగళవారం తెల్లవారుజాము నుండే తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. దీంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీవారి దర్శనం చేసుకునే భక్తులు వర్షంలో తడవకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దర్శనం చేసుకుని వెలుపలకు వచ్చిన భక్తులు తలదాచుకునేందుకు షెడ్ల వైపుకు పరుగులు తీస్తున్నారు.



వర్షాలతో భక్తులకు టీటీడీ సూచనలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, విపరీతమైన చలి ఉండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈనేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులకు టిటిడి అధికారులు సూచనలు చేస్తున్నారు. భారీ వర్షాలు పడుతున్న సమయంలో ఘాట్ రోడ్లలో ప్రయాణించే భక్తులు జాగ్రత్తగా ఉండాలని టిటిడి సూచిస్తోంది. అలాగే చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో చిన్నారులు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని టిటిడి సూచనలు చేస్తోంది. ఇదిలా ఉంటే నిన్న తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం కంటే అధికంగా ఉంది సోమవారం భక్తులతో అన్ని కంపార్ట్మెంట్లో నిండిపోగా శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పట్టింది. తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో వర్షం పడుతున్న కారణంగా భక్తులు జాగ్రత్తగా ఉండాలని టిటిడి అధికారులు సూచిస్తున్నారు.

అక్రమ కట్టడం కూల్చివేయాలంటూ ఘర్షణ

జెసిబి, జనాలతో వచ్చిన వెంకటయ్య గౌడ్
పోలీసులపై మాజీ ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన
కోర్టు ఆర్డర్ చూపుతున్న స్థల యజమాని

ప్రజాశక్తి- పలమనేరు

పలమనేరు గుడియాత్తం రోడ్డులో కాలేజీ గేటుకు ఎదురుగా విద్యానగర్ స్కూలు పక్కన మీడియా ప్రతినిధి పార్థసారథి తన సొంత స్థలంలో గృహనిర్మాణం చేస్తుండగా పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకయ్య గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులతో కలసి జెసిబితో వచ్చి వెంటనే ఆ నిర్మాణాన్ని కూలదోయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంలో అక్కడికి చేరుకున్న అర్బన్ ఎస్సై లోకేష్ రెడ్డి, పోలీస్ సిబ్బందిపై వైసీపీ శ్రేణులు వెంకట గౌడ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దురుసుగా ప్రవర్తించి ఘర్షణకు దిగారు. పోలీసులు వైసీపీ శ్రేణులను వారించి కూలదూయడాన్ని ఆపి జెసిబి స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపారు. ఈవిషయమై స్థల యజమాని పార్థసారథి మాట్లాడుతూ తనకు ఈ ఇంటి జాగా పట్టా 1998లో గవర్నమెంట్ మంజూరు చేసిందని గృహ నిర్మాణంగా సంబంధించి అన్ని రకాల అనుమతి పత్రాలు హైకోర్టు ఆర్డర్ కాపీలను మీడియా ముందు చూపించారు. తనకు అన్ని రకాల అనుమతులు హక్కు ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే అనవసరంగా రాద్ధాంతం చేస్తూ తమకు ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే అనుచరులతో కలిసి ఎస్సైతో వాగ్వాదం

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండండి

ఫిర్యాదుల కోసం 9849907885 ఏర్పాటు : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. మంగళవారంనగరపాలక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో నగరపాలక పరిధిలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం చేయాలని, నీవా నదిలో నీటి మట్టాన్ని అంచనా వేస్తూ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో వేగంగా స్పందించి ప్రజలకు అందుబాటులోకి రావాలన్నారు. నగరంలో ఎక్కడా వర్షపు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఫిర్యాదుల కోసం నగర పాలక కార్యాలయంలో 9849907885 నెంబరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి



ఏనుగులు తొక్కి నాశనం చేసిన వరి

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలంలో ప్రతిరోజు ఏనుగుల దాడి జరుగుతూనే ఉంది. దేవళం పేట పంచాయతీ సరిహద్దులోని అటవీ విభాగం ప్రాంతంలో సూరప్ప చెరువు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తూ ఉండడం సమీపంలోని రైతులు గమనించారు. రైతులను గమనించిన ఏనుగుల గుంపు తీవ్రంగా అరుపులు పెట్టసాగాయి. అటవీ శాఖ సిబ్బందికి సమాచారం తెలుపగా ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతానికి చేరుకుని టపాకాయలు కాల్చి ఏనుగులను భయపెట్టి అడవుల్లోకి తరిమివేశారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం తెల్లవారుజామున దేవళంపేట పంచాయతీలో మామిడి, అరటి, కొబ్బరి పంటలను ధ్వంసం చేశాయి. అదేవిధంగా మంగళవారం తెల్లవారు జామున సూరప్ప చెరువు నుంచి బయలుదేరిన ఏనుగులు గుంపు మెట్ట మీద రాజుపల్లి వద్దకు చేరుకుని బసవరాజు, రమణమ్మ తదితర రైతులకు చెందిన వరి పంటను తిని తొక్కి నాశనం చేశాయి, కొబ్బరి, టమోటా, మామిడి పంటలనునాశనం చేశాయి. రామయ్య, మధు రైతులకు చెందిన పొలాలను ధ్వంసం చేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే తిరిగి ఏనుగులు తూర్పు విభాగంలోని రిజర్వు ఫారెస్ట్‌లోకి వెళ్లినట్లు రైతులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర క్రీడల శాఖవారు క్రీడాశాఖ 2025 సంవత్సరానికి అర్జున అవార్డు, అర్జున (జీవితకాలం) అవార్డు, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య అవార్డులు (జీవితకాలం) రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.బాలాజి మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మన జిల్లా నుండి అర్హత కలిగిన వారు దరఖాస్తులను ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే ఆహ్వానిస్తున్నారు. అవార్డు మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత ఉన్న సంస్థలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను అక్టోబర్ 28 రాత్రి వరకు ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.



మున్సిపల్ కార్మికులకు టపాసుల బాక్సు అందించిన బిసి నాగరాజ్

మున్సిపల్ కార్మికులకు దీపావళి కానుక

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపల్ కార్మికులకు బి సియన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీపావళి కానుక అందించారు. బిసియన్ గ్రూప్ ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్, కార్యదర్శి సాగర్ రాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా లక్ష రూపాయలు విలువచేసే క్రాకర్స్ గిఫ్ట్ బాక్స్‌లను మున్సిపల్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సంఘాధ్యక్షుడు మహేష్, గంగమ్మ గుడి డైరెక్టర్ జయరాం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జనసేన నాయకులు

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని జనసేన నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. నామినేటెడ్ పదవుల్లో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, గంగమ్మ, వినాయక ఆలయ కమిటీలలో జనసేన నాయకులకు సముచిత స్థానం కల్పించడంతో వారు ధన్యవాదాలు తెలుపుతూ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి ఛైర్మన్ శ్రీధర్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దిలీప్ కుమార్, జనసేన నాయకులు నాగరాజా, హరీష్, శివ, రమేష్, భరత్, రాజేష్, ఆయాజ్ బాషా, శబరీష్, మాధవ, నరేష్, మహేష్‌లతో పాటు మురాద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌ను కలిసిన కరాటే విద్యార్థులు

ఎమ్మెల్యేను కలిసిన కరాటే విద్యార్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. మదనపల్లి యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఊటీలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో వివిధ పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించి అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు, నేషనల్ ట్రైనర్ చెంగల్రాయ నాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవిణి సాయి, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -పలమనేరు (గంగవరం): తమకు దారి సమస్యను పరిష్కరించాలని గంగవరం మండలం బండమీద జరావారి పల్లెలో అధికారులను, నాయకులను కోరారు. పూర్వకాలం నుండి ఉన్న దారిని ప్రస్తుతం ఒక వర్గానికి చెందిన వ్యక్తులు తమ సొంత భూమి అని అడ్డగిస్తున్నారని ఈ దారి నుండే ఆంజనేయ స్వామి దేవాలయానికి వ్యవసాయ పొలాలకు తమ పెద్దల కాలం నుండి వెళ్తే వారిమని పేర్కొన్నారు. రెండు రోజులుగా ఈ దారిలో ఎవరూ రాకపోకలు కొనసాగించకుండా జెసిబితో తవ్వేశారని సంబంధిత అధికారులు స్పందించి తమకు దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ (జంతు శాస్త్రం) ఒప్పంద అధ్యాపక పోస్టు భర్తీ చేసేందుకు ఎంఎస్సీ జువాలజీ లో 50 శాతం మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అర్హత కలిగిన వారు ఈనెల 27వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకుని హాజరు కావచ్చునని ఆ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ తెలిపారు.

పలు గ్రామాలలో కేదార గౌరీ వ్రతం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని వెలిసిన అల్లి ఎల్లమ్మ ఆలయంలో కేదార గౌరీ వ్రతాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి సోమవారం మధ్యాహ్నం నుండి మంగళవారం ఉదయం వరకు గ్రామ మహిళలు కేదార గౌరీ వ్రతం నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంచిపెట్టారు. తూగుండ్రం పంచాయతీ తా గుండ్రం శ్రీచెలకేశేశ్వర స్వామి ఆలయంలో మహిళలు కేదారి గౌరీ వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు శివ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరణం తర్వాత చెల్లిస్తామనడం దారుణం: వైఎస్ఆర్‌టిఏ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన కరవు భత్యాన్ని విరమణ లేదా మరణించిన తరువాత చెల్లిస్తామని పేర్కొనడం దారుణం అని వైయస్ఆర్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ రెడ్డి శేఖర్ రెడ్డి ఆరోపించారు. కరవు భత్యం జీఓలు చూసి ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఉద్యోగుల మరణాన్ని కోరుకుంటున్న కూటమి ప్రభుత్వం 21నెలల అరియర్స్ చెల్లించడానికి ఇబ్బందిగా ఉంటే విరాళంగా తీసుకోవాలని తెలిపారు. అవగాహన లేని ఆర్థికశాఖ అధికారులు జీవోలో మెలికలు పెట్టి ఉద్యోగుల కుటుంబాల్లో దీపావళి లేకుండా చేశారని మండిపడ్డారు. పెన్షనర్లకు 2027 లో చెల్లిస్తామనడం సరి కాదని అన్నారు.

రహదారి బురదమయం

- నీటితో నిండిన గుంతలు
- పాదచారులు, వాహనచోదకులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు పట్టణం నుండి గంగవరం పంచాయతీ నీలకుంటకు వెళ్లే దారి పూర్తిగా బురద నీటితో నిండిపోయింది. దీంతో వాహన చోదకులకు, పాదచారులకు ఇక్కట్లు తప్పడంలేదు. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రహదారి బురదమయం

నీలకుంటకు వెళ్లే దారి పూర్తిగా కట్టడాలు నిర్మించడంతో దారి తగ్గ ప్రాంతంలో ఉండడంతో చుట్టుపక్కల నీళ్లన్నీ ఈ దారిపై చేరడంతో వృథా నీరు వెళ్లడానికి మార్గం లేక దారిలోనే ఉండి పోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు నీలకుంట రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తే వృథా నీరు మడుగులా చేరకుండా వుంటుందని పేర్కొంటున్నారు.

నీటితో నిండిన గుంతలు

రహదారిపై గుంతలు నీటితో నిండి బురదమయం కావడంతో దారి వెళ్లే సమయంలో కనిపించక ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందని పాదచారులు, వాహనచోదకులు వాపోతున్నారు.

పాదచారులు, వాహన చోదకులకు ఇక్కట్లు

రహదారులకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటు పాదచారులు, వాహన చోదకులు పలు ఇక్కట్లకు గురవుతున్నామని, వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని వారు కోరుతున్నారు.



వాహనాలకు ఆయుధపూజ నిర్వహిస్తున్న ఆగస్తి పబ్లిక్ స్కూలు యాజమాన్యం

వాహనాలకు ఆయుధ పూజ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఆగస్తి పబ్లిక్ స్కూలులో సోమవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి గసాల కృష్ణమూర్తి, మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప కుటుంబ సభ్యుల అధ్యక్షతన పురోహితులు వాహనాలకు పూజలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వాహన డ్రైవర్లకు, పాఠశాల సిబ్బందికి దుస్తులు, స్వీట్లు పంచి పెట్టామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి ఎంపీటీసీలు, సర్పంచులు, ఆ పార్టీ కుటుంబ సభ్యులు, విద్యార్థినివిద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పలువురు శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిఎస్‌పి ప్రభాకర్

ప్రజాశక్తి - పలమనేరు: దీపావళి పండుగను పురస్కరించుకొని పలువురు అధికారులు, నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణి నాయుడు ఎమ్మెల్యేను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పలమనేరు డిఎస్‌పి డేగల ప్రభాకర్, సిఐలు మురళీమోహన్, ప్రసాద్, పరశురాముడు, ఎస్ఐ లోకేష్ రెడ్డి, పుష్పగుచ్ఛాలు అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.




జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బాధితురాలికి సాయం అందిస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాలువ పంచాయతీ ఎల్లమ్మరాజు పల్లి గ్రామం లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పూరి గుడిసె పై కప్పు దెబ్బ తినడంతో కుమారి కుటుంబానికి జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి మహదేవ నాయుడు మంగళవారం రెడ్ క్రాస్ తరపున గుడిసె కప్పుకోవడానికి టార్పాలిన్ షీట్, వంట చేసు కోవడానికి 14 రకాల వంట సామగ్రి కుమారి కుటుంబానికి అందించారు. రెడ్ క్రాస్ సభ్యులు హరికృష్ణ రెడ్డి, జీవిత బాధితురాలికి దుస్తులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పరిపాలనాధికారి గోపి, జిల్లా కోఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల స్వయంభీశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి సోమలకు చెందిన దొంగరి సాంబయ్య విజయలక్ష్మి దంపతులు15,011 రూపాయలు, పి మల్లికార్జున చంద్రకళ దంపతులు10,011 రూపాయలు విరాళం అందించారని ధర్మకర్త బివి సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగన్న, శంకర పాల్గొన్నారు.



పాటూరి రాజగోపాల్ నాయుడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాటూరి రాజగోపాల్ నాయుడుకి నివాళి

ప్రజాశక్తి- తవణంపల్లి: తవణంపల్లి మండలం దిగువమాఘం గ్రామంలో మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 28వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర రాజా వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టరు రమాదేవి , అమర రాజా కంపెనీ ఛైర్మన్ గల్లా జయదేవ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ విక్రమాదిత్య , గౌరినేని రాజన్న మెమోరియల్ పార్క్ వద్ద రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దిగువమాఘం సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు , రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్లపల్లి, యల్లంపల్లి సురేష్, గల్లా కుటుంబ అభిమానులు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య

- అందుబాటులో లేని పోలీసులు
- వాహన చోదకుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి- పలమనేరు: దీపావళి పండుగ పూట సందర్భంగా విపరీతమైన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ సమస్యను పరిష్క రించేందుకు పోలీసులు అందుబాటులో లేకపోవడంతో వాహన చోదకుల మధ్య ఘర్షణ పెరిగి పెద్దదైంది. వారి మధ్య గొడవకు దారితీసి కొట్టుకునే స్థితికి చేరింది. పలమనేరు గంగమ్మ గుడి వీధిలో దీపావళి పండుగ పూట విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఏకంగా నడిరోడ్డుపై ఆటోలు, టూవీలర్లు అడ్డంగా నిలిపి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వాహన చోదకులు సర్దుబాటు చేసుకునే ఓపిక లేక ఏకంగా గొడవలకు దిగారు. పోలీసులు అందుబాటులో లేకపోవడంతో ఒకరికొకరు కొట్టుకునే పరిస్థితి నెకొంది. సోమవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయ గేటు ముందు రోడ్డుకు అడ్డంగా ఒక ఆటో నిలవడంతో, అక్కడే రోడ్డుకు అడ్డంగా పెట్టిన ద్విచక్ర వాహన చోదకుని మధ్య ట్రాఫిక్ సమస్య తలెత్తింది. చివరకు ఒకరినొకరు దుర్భాషలాడుకుంటూ గొడవకు దిగి కొట్టుకునే పరిస్థితికి చేరింది. స్థానికులు ఇద్దరినీ వారించి



ట్రాఫిక్ సమస్యలతో ఒకరినొకరు కొట్టుకుంటున్న దృశ్యం

అక్కడి నుండి పంపివేశారు. దాదాపు 20 నిమిషాల పై ఇంత తతంగం కొనసాగుతున్నా అక్కడ దరిదాపుల్లో కనీసం ఒక పోలీసు కూడా కనిపించకపోవడం గమనార్హం. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులు పండగ పూట ట్రాఫిక్ సమస్యలను కంట్రోల్ చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి -విజయపురం: రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్సను స్థానిక ఆలపాకం కండ్రిగలో నిర్వహించామని డాక్టర్ ఎస్ శివమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నిండ్ర మండలం సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ ముని లక్ష్మీపతి, ఏపీఎల్‌డిఏ డాక్టర్ సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స చేసి మినరల్ మిక్చర్, మందులు అందించారు. 130 పశువులకు పిడుదుల మందు నివారణ మందును పిచికారీ చేసి దూడలకు నట్టల నివారణ మందులు సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురం మండలు కళియం బాకం డాక్టర్ శివమూర్తి, పశు వైద్య సిబ్బంది పి చిరంజీవి, ఎన్ ధనవేలు, మనోజ్, పి ప్రవీన్, పాడి రైతులు పాల్గొన్నారు.



పశువులకు చికిత్స అందిస్తున్న డాక్టర్లు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు: తహశీల్దారు

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు పి కిరణ్ కుమార్ తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వాగులు వంకలు దగ్గరకు వెళ్ల కూడదని సూచించారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయా లని సిబ్బందికి సూచించారు. మండ లంలోని గ్రామాలలో వీఆర్వోలు, సిబ్బంది అందు బాటులో ఉంటా రని తెలిపారు. ఎక్కడైనా ఇల్లు దెబ్బతిన్నా, చెరువు కట్టలు తెగినా కంట్రోల్ రూమ్ నెంబర్ 6309641900 కు సమాచారం ఇవ్వాలని అన్నారు.



మొక్కజొన్న పంటలో భారీ నష్టం

ప్రభుత్వం సాయం చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం తీర్థం పంచాయతీ పరిధిలోని రైతు ఆనందప్పకు ఈ సీజన్‌లో మొక్కజొన్న పంటలో తీవ్రమైన నష్టం వాటిల్లింది. సీజెంటా కంపెనీ మార్గదర్శకత్వంలో రెండు ఎకరాల భూమిలో సాగు చేసిన మొక్కజొన్నకు వర్షాల లోపం తీవ్ర ప్రభావం చూపింది. సాధారణంగా ఎనిమిది టన్నులు దిగుబడి రావలసిన చోట ఈసారి కేవలం నాలుగు టన్నులకే పరిమితమైందని రైతు ఆనందప్ప తెలిపారు. క్రిమిసంహారక మందులు కంపెనీ వారే ఇచ్చినప్పటికీ, కూలీల ఖర్చులు, ఇతర వ్యవసాయ వ్యయాలు రైతులే భరించాల్సి వచ్చిందని, ఒక్క ఎకరానికి సుమారు 35 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని, కానీ వర్షాలు సరైన సమయంలో కురవకపోవడంతో



పంటలో భారీ నష్టం జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై హార్టికల్చర్ ఆఫీసర్ విజయమ్మ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను సేకరించారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ముందుకు వచ్చి సకాలంలో నష్టపరిహారం అందిస్తే రైతులకు ఎంతో ఊరట కలుగుతుందని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి): దీపావళిని పురస్కరించుకొని మాజీ మంత్రి ఆర్‌కె రోజా ఇంట ఆదివారం సందడి నెలకొంది. ఆమె కుటుంబ సభ్యులతో పాటు చిచ్చుబుడ్డీలు, భూచక్రాలు, కాకరొత్తులు కాలుస్తూ ఆనందంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఇంటి వద్దే కేదారగౌరీ, ధనలక్ష్మీ వ్రతం ఆచరించారు. వాహనాలకు ఆయుధపూజ చేశారు. పండుగ ప్రసాదాలను అందరికీ పంచిపెట్టారు. అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నటి రవళి మాజీ మంత్రి ఇంటికి అతిథిగా విచ్చేసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రితో పాటు టపాకాయలు కాలుస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఎన్‌డిఏ కూటమి అధికారం చేపట్టిన 16 నెలలుగా రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల వలసలు, ఆరోగ్యశ్రీ లేకుండా పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. సరైన విద్య అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి అంధకారంలో ఉన్న రాష్ట్రానికి దీపావళి కాంతులు తేవాలన్నారు. దీపావళి కాంతులు మార్పుకు నాందీ పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త ఆర్కే సెల్వమణి, కుమారుడు కృష్ణకౌశిక్, సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



దీపావళి సంబరాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

సోమల: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని ప్రజలు ఆనంద ఉత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి మహిళలు చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేసి దైవ దర్శనం చేసుకున్నారు.సాయంత్రం టపాకాయ లను పేలుస్తూ పండుగను ఆనంద ఉత్సాహాల మధ్య జరుపుకున్నారు.

రామకుప్పం: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమ, మంగళవారం స్థానిక అన్నపూర్ణాంబ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి అమ్మవారిని విశేషంగా అలంకరించి వ్రత నోములు చేశారు. నరక చతుర్దశి అనంతరం పెద్ద ఎత్తున టపాకాయలు, బాణాసంచి పేల్చి సంబరాలు జరుపుకున్నారు. గ్రామాల్లోని స్థానిక ఆలయాల్లో భక్తాదులు విశేష పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు.

దేవ దొడ్డి ఎంపీటీసీ లక్ష్మమ్మ మృతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని కొత్త ఇండ్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంగ్రాయప్ప భార్య ఎంపీటీసీ లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి తో కలిసి కొత్త ఇండ్లు గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహానికి పూల మాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు, వైసిపి ఎంపీటీసీలు , సర్పంచులు వైసిపి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఆమె కుమారుడు శివకుమార్ కు ధైర్యం చెప్పారు. వారి తల్లిదండ్రులు వలే పార్టీకి కృషి చేయాలని కోరారు.

వృద్ధురాలు అదృశ్యం

ప్రజాశక్తి - బంగారు పాల్యం: బంగారుపాళ్యం దళితవాడకు చెందిన చిన్నప్ప భార్య ఎట్టరి కుప్పమ్మ (58) శనివారం ఉదయం ఈ నెల 18వ తేదీ నుండి కనిపించడం లేదని సిఐ తెలిపారు. ఈమెకు మతి స్థిమితం సరిగా లేదని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440796736, 9494 749437, 9030084041 నెంబర్లకు సమాచారం తెల పాలని బంగారు పాళ్యం సిఐ శ్రీనివాసులు సూచించారు.



డీఏపై ప్రకటన హాస్యాస్పదం

చిత్తూరు అర్బన్ : సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాల సమావేశంలో ముఖ్య మంత్రి ప్రకటనకు భిన్నంగా కరువు భత్యానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్‌టియు నాయకులు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు భరోసా..

ప్రజాశక్తి-రామకుప్పం: కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాల భరోసా కల్పిస్తోందని కుప్పం నియోజవర్గ రైతు అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తోతాపురి మామిడి రైతులకు టన్నుకు 4 వేలు చొప్పున, జిల్లాకు రూ:150 కోట్లు వరకు అందించారన్నారు. గోకులం షెడ్లు, అన్నదాత సుఖీభవ, ఉద్యాన శాఖ ద్వారా పంటలు ఉత్పత్తులు, గిట్టుబాటు ధర కల్పించారన్నారు. కృష్ణా జలాలను హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి తరలించడంలో సీఎం చంద్రబాబు అపర కృషి చేశారన్నారు.

టిడిపి నేత ఈశ్వర్‌పై దాడి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సంతపేటకు చెందిన టిడిపి నాయకులు ఈశ్వర్‌పై అదే పార్టీకి చెందిన మౌళి దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈశ్వర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి సందర్భంగా మార్కెట్ యార్డులో టపాకాయలు కొనుగోలు చేసేందుకు తన అన్న కుమారుడు తాను వెళ్లామని అక్కడ చిన్న గొడవతో తాను వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండగా తనపై చిత్తూరు ఎమ్మెల్యే అనుచరుడు మౌళి మరో 30 మంది విచక్షణ రహితంగా దాడి చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం తాను సీనియర్ బీసీ నాయకుడిగా పని చేశానని తనపై దాడి చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

టిడిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గుడిపాల మండలం టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్‌జయచంద్రన్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ , చిత్తూరు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షుడు సీఆర్ రాజన్ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంతో రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయచంద్రన్‌ను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మురళి, మాజీ సర్పంచ్ పయని, నవీన్ ఉన్నారు.



భవిష్యత్తును హోస్ట్ చేసే గిగావాట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: భారతదేశ తూర్పు డిజిటల్ విప్లవానికి విశాఖపట్నం నాయకత్వం వహించనుందని తెలిపారు. గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ భవిత మారనుందని ఆయన ఉద్ఘాటించారు. గ్రీన్ డిజిటల్ పవర్‌కి ఏపీ నమూనా ఆవిర్భవిస్తుందని అభిప్రాయపడ్డారు. గూగుల్ రాకతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు క్యూ కడుతున్న నేపథ్యంలో దీపావళి పండుగ రోజు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పందించారు. ఇంత గొప్ప ప్రాజెక్ట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. దేశ తూర్పు సముద్ర తీరాన్ని పునర్నిర్మించే ఇంజన్‌లా పనిచేస్తుందన్నారు. డిజిటల్ యుగం రిఫైనరీగా విశాఖ పట్నం మారడానికి సిద్ధంగా ఉందన్నారు. ఒక గిగావాట్ సెంటర్ అనేది పవర్ ప్లాంట్ కి సమానమైన సాంకేతికతతో కూడిన 21వ శతాబ్దపు అదృశ్య జీవనాడిగా వినియోగపడు తుందన్నారు. 1,700 మంది కార్మికులు పని చేస్తారని యువతకు స్థిరమైన జీవనోపాధి, శిక్షణను అందించి, నిరుద్యోగ యువత ఉజ్వల భవితకు బాటలు వేస్తుందన్నారు.

క్రైం న్యూస్



సిగరెట్ కోసం యువకుల వీరంగం

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని యలేజనూరులో సిగరెట్ కోసం యువకులు వీరంగం సృష్టించారు. గ్రామంలో చిల్లర దుకాణం నడుపుకుంటున్న నాగరాజ్ దుకాణం వద్ద సోమవారం రాత్రి సిగరెట్ కోసం యువకులు నానా హంగామా చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న నాగరాజును సిగరెట్ కోసం లేపగా అతను దుకాణం తెరిచి సిగరెట్ ఇవ్వలేదన్న కోపంతో యువకులు నాగరాజుపై దాడి చేయడంతో పాటు ఇంట్లోనే కుర్చీలను ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన మరికొంతమంది యువకులు వచ్చిన కారు అద్దాలు పగలగొట్టారు. అయితే రాత్రి 10 గంటల సమయంలో మొదలైన ఘర్షణ కాస్త అర్ధరాత్రి వరకు సాగింది. ఒకరిపై మరొకరు దుర్భాషలాడుతూ కొట్టుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. యువకుల దాడిలో గాయపడ్డ నాగరాజును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించారు. అయితే దాడి ఘటన నేపథ్యంలో మంగళవారం ఉదయం కుప్పం పోలీస్ స్టేషన్ వద్ద హై డ్రామా చోటు చేసుకుంది. ఇరు వర్గాలకు సర్ది చెప్పేందుకు కొంతమంది ప్రయత్నించినా నాగరాజు తరపు వారు ససేమిరా అనగా పోలీస్‌స్టేషన్ వద్ద ఇరువర్గాలు గుమి కూడటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. నాగరాజు పై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడి తరపు వారు డిమాండ్ చేశారు.

8 మందిపై కేసు నమోదు

కుప్పం మున్సిపాలిటీ యలేజనూరులో సిగరెట్ కోసం అర్ధరాత్రి యువకులు వీరంగం సృష్టించిన ఘటనలో 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో చిల్లర కొట్టు నడుపుతున్న నాగరాజు పై దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. దాడికి పాల్పడ్డ వారిలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

హద్దులు దాటిన సోషల్ మీడియా

-ఆనందరావు ఇంటిపై దాడి -అయిదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : సోషల్ మీడియా ..వాట్సాప్.. గ్రూపుల్లో ఒకరిపై ఒకరు హద్దులు దాటి పోస్టు లు పెట్టడం ఒకరిని ఒకరు దూషించుకున్న సంఘటనలో సోమవారం పొదలపల్లికి చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. మండలంలోని పొదలపల్లి హరిజన వాడకు చెందిన ఆర్ ఏకాంబరం, ఆర్‌భరత్, ఆర్ లోకేష్, ఎంరాజేష్, ఆర్ చరణ్ సోషల్ మీడియా, వాట్సాప్ లో అదే గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన ఆనందరావు పై పరస్పరం అసభ్యకర వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టుకోవడంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత ఏర్పడింది. ఆదివారం రాత్రి ఆనందరావు ఇంటిపై మరణాయుధాలతో దాడి చేశారని, ఆయనతోపాటు కుటుంబ సభ్యులు భారతి, జానీలకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. తలుపులు ధ్వంసం చేసినట్లు పోలీసులకు ఆనందరావు ఫిర్యాదు చేయడంతో ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి , చిత్తూరు ఎస్పీ, నగరి డిఎస్పి, కార్వేటినగరం సిఐ ల సలహాలు తీసుకొని ఆర్ ఏకాంబరం, ఆర్ భరత్, ఆర్ లోకేష్, ఎం రాజేష్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- రామకుప్పం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు...వి కోట మండలం కరిప్పల్లి గ్రామానికి చెందిన రమేష్ రెడ్డి (52), భారతమ్మ (48) ద్విచక్ర వాహనంలో వికోట నుండి రాజుపేట రోడ్డు వైపు వస్తుండగా బురుగుమాకులపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుండి గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ప్రమాదం లో భారతమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రమేష్ రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో కుప్పం ఆసు పత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనం, ద్విచక్ర వాహనాన్ని అర్థ కిలోమీటర్ మేర ఈడ్చికెళ్లి కర్ణాటక వైపు వేగంగా దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు. రామకుప్పం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని టపాసుల విక్రయం పట్టివేత

ప్రజాశక్తి -బంగారుపాలెం: అక్రమంగా విక్రయిస్తున్న టపాసులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు మంగళవారం మండలంలోని తుంబుకుప్పంలో ప్రాథమిక పాఠశాలలో చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు మండలం అప్పిరెడ్డి కండిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు దూర్వాసులు తుంబ కుప్పం ప్రాథమిక పాఠశాలలో టపాకాయలు అనుమతి లేకుండా విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో అతని వద్ద వున్న 70వేల రూపాయలు విలువచేసే టపాకాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రసాద్ , కానిస్టేబుల్ మోహన్ పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి

ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి -యాదమరి: రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం యాదమరి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన మణిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా పలు విషయాలు బహిర్గతమయ్యాయి.ఫిర్యాదు దారుడు మణిరత్నం గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ చిన్నచిన్న సినిమాలలో నిర్మాతగా పనిచేయాలనే ఉద్దేశ్యంతో వున్నాడని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో, తనకు ఇంతకు ముందు పరిచయం ఉన్న తమిళనాడుకు చెందిన పరమేశ్వరన్ అనే వ్యక్తిని ఫోన్ చేసి, "నాకు 20 లక్షల రూపాయలు అవసరం. డబ్బులు సాయం చేస్తే నీకు రెండు శాతం కమీషన్ ఇస్తాను" అని చెప్పాడన్నారు. దీని ప్రకారం, ఈ నెల 16వ తేదీన మణిరత్నం బెంగళూరులో నుండి కుప్పంకు వచ్చాడు. అక్కడ నుండి పరమేశ్వరన్‌తో కలిసి చిత్తూరుకు బయలు దేరాడు. చిత్తూరులో పరమేశ్వరన్ స్నేహితుడు రాజ్‌కుమార్‌ను తన కారులో ఎక్కించుకున్నారు. అనంతరం వీరు వెదురుకుప్పం మండలంలోని తెల్లగుండ్లపల్లి సమీపంలో ఉన్న ఒక క్వారీ యజమాని వద్దకు తీసుకెళ్లి, "ఇక్కడ డబ్బులు ఇస్తాడు" అని చెప్పి మణిరత్నంను బలవంతంగా కారులో బంధించి తీవ్రంగా దాడి చేశారు.ఈ దాడి సమయంలో, మణిరత్నం మొబైల్ ఫోన్ ద్వారా రూ.2,33,000 మొత్తాన్ని పరమేశ్వరన్‌కు తెలిసిన వారి మొబైల్ నంబర్లకు బలవంతంగా బదిలీ చేయించారు. అనంతరం, అక్టోబర్ 18వ తేదీ రాత్రి భూమిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని నంజర్ల ప్రాజెక్ట్ వద్ద నీటిలో కూర్చోబెట్టి, సిగరెట్లతో కాల్చుతూ, విచక్షణ రహితంగా హింసించారు. ఈ క్రమంలో అతని తలకు గాయాలయ్యాయి, మరిన్ని డబ్బులు ఇవ్వామని వేధించారు. ఈ నెల 19వ తేదీ ఉదయం చిత్తూరుకు తీసుకెళుతున్న సమయంలో, వారు టీ తాగేందుకు ఆపినప్పుడు మణిరత్నం తప్పించుకొని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం తన బంధువులకు వివరాలు తెలిపి 20వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేశారు. ఓటేరుపల్లి బస్టాండ్ దగ్గర మంగళవారం సాయంత్రం 4 గంటలకు తమిళనాడుకు చెందిన పరమేశ్వరన్, చిత్తూరు టౌన్ ఓల్డ్ ప్రశాంత్ నగర్‌కు చెందిన రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు.